హోం ఓటింగ్‌కు అర్హులను గుర్తించాలి

నెల్లికుదురులో హోం ఓటింగ్‌పై బీఎల్‌వోలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రాజు

నెల్లికుదురు, ఏప్రిల్ 1: హోం ఓటింగ్‌కు అర్హులైన వారిని ఈ నెల 23లోపు గుర్తించాలని బూత్ లెవల్ అధికారులను తహసీల్దార్ కే రాజు ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ చాంబర్‌లో హోం ఓటింగ్ అర్హుల గుర్తింపు ప్రక్రియపై సెక్టోరియల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి 40శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం, నడవలేని స్థితిలో ఉన్న వారిని గుర్తించి, వారితో ఫారం-12డీని నింపి 23 వరకు తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. దరఖాస్తులను షెడ్యూల్ ప్రకారం కలెక్టరేట్‌కు పంపిస్తామన్నారు. అర్హులతో ఓటింగ్ తేదీకి వారం రోజుల ముందు నుంచి ప్రత్యేక పోలింగ్ బృందం బ్యాలెట్ ఓటింగ్ వేయిస్తారని తెలిపారు. హోం ఓటింగ్ ప్రక్రియను సక్సెస్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్లు నెలకుర్తి రవీందర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు లేకుండా చూడాలి

మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి

మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తున్న చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్, ఏప్రిల్ 1 : తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో తాగునీటి సరఫరాపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలకు ఎలాంటి అవాంతరాలు లేకుండా తాగునీటి సరఫరా చేయాలన్నారు. ప్రత్యామ్నాయ నీటి వనరులపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్‌యాదవ్, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, సీపీఎం కౌన్సిలర్ సూర్నపు సోమయ్య, సీపీఐ కౌన్సిలర్ బామనపల్లి అజయ్‌సారథిరెడ్డి, కౌన్సిలర్లు ఎడ్ల వేణుమాధవ్, పోతురాజు, వెంకన్న, హరిసింగ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నర్సింహులపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఈవో రామకృష్ణ

నర్సింహులపేట/గార్ల/ దంతాలపల్లి/గూడూరు/కొత్తగూడ, ఏప్రిల్ 1: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పలువురు అధికారులు కోరారు. నర్సింహులపేట మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏఈవో రామకృష్ణ, గార్ల మండలకేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో సీఈవో సింగు వెంకటేశ్వర్లు, దంతాలపల్లి మండలంలోని గున్నెపల్లి గ్రామంలో ఏఈవో దీక్షిత్‌కుమార్, గూడూరు మండల కేంద్రంలో సబ్‌స్టేషన్ సమీపంలో ఏఈవో వైజయంతి, కొత్తగూడ మండలంలో సాయిబాబా గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో స్పెషల్ ఆఫీసర్, ఏవో ఉదయ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రేడ్-ఏ రకం ధాన్యానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 మద్దతు ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం విక్రయించే సమయంలో ఓటీపీ నంబర్ కోసం ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నంబర్ రైతుల వద్ద ఉంచుకోవాలన్నారు.

కొత్తగూడ: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏవో ఉదయ్

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్

తొర్రూరు, ఏప్రిల్ 1: ఆస్తి పన్నుపై 5శాతం రాయితీని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పీ శాంతి కుమార్ కోరారు. డివిజన్ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లించే వారికే ఐదు శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాల మేరకు నేటి నుంచి ఏప్రిల్ 31వ వరకు తెలంగాణ ప్రభుత్వం ఆస్తి పన్నుపై 5శాతం రిబేట్ ప్రకటించిందన్నారు. తొర్రూరు పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆస్తి పన్ను వసూళ్లతో ఆదాయం పెరిగితే అభివృద్ధి పనులకు నిధుల కొరత ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కట్ట స్వామి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దవంగర: శ్రీరాంసాగర్ జలాలు రావడంతో గత ఏప్రిల్ నెలలో మత్తడి దుంకిన బొమ్మకల్లులోని పాలేరు వాగు చెక్‌డ్యామ్(ఫైల్)

పాలేరు వెలవెల

ప్రస్తుతం శ్రీరాంసాగర్ జలాలు రాక ఎండిపోతున్న పాలేరు వాగు చెక్‌డ్యామ్

పెద్దవంగర, ఏప్రిల్ 1 : నాడు బీఆర్ఎస్ పాలనలో కళకళలాడిన పాలేరు వాగు.. ప్రస్తుతం నీళ్లు దగ్గరపడి వెలవెలబోతున్నది. శ్రీరాం సాగర్ జలాలు రావడంతో పెద్దవంగర మండలం బొమ్మకల్లులోని పాలేరు వాగు చెక్‌డ్యామ్ గత ఏప్రిల్ నెలలో మండుటెండల్లో సైతం మత్తడి దుంకింది. రైతులకు రందిలేకుండా పంట పొలాలకు నీళ్లందించింది. కానీ, ఇప్పుడు శ్రీరాంసాగర్ నుంచి చుక్క నీరు రాక పాలేరు వాగు ఎండిపోతున్నది. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. మరో పది రోజుల్లో ఉన్న నీళ్లు కూడా ఇంకిపోయి పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వేసవిలో తాగునీటి జీవాలు కూడా అల్లాడుతాయని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి శ్రీరాంసాగర్ జలాలతో పాలేరువాగు నింపి పంటపొలాలకు నీళ్లందించాలని ప్రజలు కోరుతున్నారు.

మెస్ చార్జీలు విడుదల చేయాలి

- హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు

ఎస్సీ సంక్షేమాధికారికి వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మహబూబాబాద్, ఏప్రిల్ 1 : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ సంక్షేమ శాఖలో పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఎస్సీ సంక్షేమాధికారి బాలరాజు ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా ప్రభుత్వం డైట్ బిల్లులను విడుదల చేయడం లేదన్నారు. బిల్లుల మంజూరు కేవలం కాగితాలకే పరిమితమైందని ఆందోళన వ్యక్తం చేశారు. మెడిసిన్, బీడీఎస్, అగ్రికల్చర్ బీఎస్సీ కోర్సుల్లో చేరిన వారి బిల్లులు చెల్లించడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు గుగులోత్ సూర్యప్రకాశ్, గుండ్ల రాకేశ్, ఎండీ హస్న, మహేశ్, వినయ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలికకు అన్నీ తొమై..

చందాలు వేసుకొని పెండ్లి చేసిన తండావాసులు

కుట్టు మిషన్ అందిస్తున్న సమ్మయ్యగౌడ్

కేసముద్రం ఏప్రిల్ 1 : అనాథ బాలికకు తండావాసులు అండగా నిలిచి వివాహం జరిపించారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బడితండాకు బానోత్ ఈరు- బుల్లికి కూతురు రేష్మ ఉంది. రేష్మ చిన్నతనంలో తల్లిదండ్రులు మృతి చెందడంతో నానమ్మ వద్ద ఉంటూ చదువుకున్నది. నానమ్మ కూడా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో తండాలోని బంధువుల ఇంట్లో ఉంటున్నది. నిరుపేద కుటుంబానికి చెందిన రేష్మకు తల్లిదండ్రులు లేకపోవడంతో తండావాసులే పెద్దలై అదే తండాకు చెందిన దేవాతో సోమవారం పెండ్లి జరిపించారు. వివాహ ఖర్చులు కూడా చందాలు వేసుకొని తండావాసులే భరించారు. సమ్మిగౌడ్ ఫౌండేషన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ పెండ్లి కానుకగా కుట్టు మిషన్ ఆమెకు అందజేశారు. ఆయన వెంట చిట్ట సంపత్, అజ్మీరా రమేశ్, వాంకుడోత్ రాజానాయక్, కొండేటి కళాధర్, అయూబ్‌ఖాన్, గొట్టం రమేశ్, బిచ్చు, దుష్యంత్, రమేశ్, మారుతి తదితరులు ఉన్నారు.

7న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 1 : మహబూబాబాద్ పట్టణ శివారులోని అనంతారం ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాల కోసం ఈ నెల 7న పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అమరావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి ప్రవేశ పరీక్ష 7వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గం టల వరకు, 7నుంచి 10వ తరగతి వరకు ఖాళీల్లో ప్రవేశాల కోసం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎగ్జామ్ ఉంటుందన్నారు. ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు నేటి నుంచే వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

పాపన్న వర్ధంతి ఘనంగా నిర్వహించాలి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 1 : బహుజన వీరుడు, రాజ్యాధికారం కోసం పోరాటం చేసిన సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్ కోరారు. పట్టణంలోని గౌడ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్న వర్ధంతి సభలో మండల, జిల్లా నాయకులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

దాడిచేసిన నిందితులు రిమాండ్

కొత్తగూడ, ఏప్రిల్ 1 : కొత్తగూడ మండలంలో ఓ యువకుడిని నిర్బంధించి కొట్టిన ఘటనలో 9 మందిపై కేసు నమోదు చేసి, ఏడుగురిని అరెస్టు రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై దిలీప్ తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు చెప్పారు. ఎస్సై కథనం ప్రకారం.. కొత్తగూడ మండలంలోని గుండేడు గ్రామానికి చెందిన వంకాయల కార్తీక్‌ను ఇటీవల డీజీ సామగ్రి అపహరించాడనే నెపంతో పొగుళ్లపల్లి గ్రామంలో బంధించి చితకబాదారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వారిలో తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు. ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. అరెస్టు చేసిన వారిలో గద్దె అశోక్, అటకూరి హరీశ్, చెవ్వ శివ, వట్టం నాగరాజ్, గుగ్గిల నర్సయ్య, బైరబోయిన అశోక్, గాజుల వెంకటేశ్వర్లు ఉన్నారు.

పకడ్బందీగా విధులు నిర్వర్తించాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్

మహబూబాబాద్, ఏప్రిల్ 1 : లోక్‌సభ ఎన్నికల్లో అధికారులు పకడ్బందీగా విధులు నిర్వర్తించాని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పీవోలు, ఏపీవోలతో లోక్ సభ ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి కలెక్టర్ నిర్వహించారు. తొలుత లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన అవగాహన కార్యక్రమాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పార్లమెంట్ పరిధిలో విధులు నిర్వర్తించే అధికారుల్లో 350 మందికి ఉదయం, మరో 350 మందికి మధ్యాహ్నం శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో మాస్టర్స్ ట్రైనర్ రాము, పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

డోర్నకల్, ఏప్రిల్ 1 : ముల్కలపల్లి గ్రామం నుంచి వెళ్తున్న ఎన్‌హెచ్- 365 భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని ఆర్ఐ రామును సోమవారం రైతులు కోరారు. ముల్కలపల్లి గ్రామంలో గ్రామ సభ నిర్వహించి రైతులకు తెలియజేయాలన్నారు. ఖమ్మం రూరల్ మండలంలో నష్ట పరిహారం ఇస్తున్నట్లుగా ఇక్కడి రైతులకు కూడా చెల్లించాలని కోరారు. రైతుల సమక్షంలోనే రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు సామినేని సతీశ్, జవ్వాజి రాంప్రసాద్, మధుసూదన్, వెంకన్న పాల్గొన్నారు.

అనారోగ్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

దేవేందర్

తొర్రూరు, ఏప్రిల్ 1: అనారోగ్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ధరావత్ దేవేందర్ (52) మృతి చెందిన ఘటన డివిజన్ కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. తొర్రూరు మున్సిపాలిటీ పరిధి 5వ వార్డులోని దుబ్బతండాకు చెందిన దేవేందర్ ప్రస్తుతం దంతాలపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందారు. ఆదివారం రాత్రి గుండెపోటు రాగా, కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించే లోపే మృతి చెందాడు. దేవేందర్‌కు భార్య జ్యోతితో పాటు కూతురు కుందన ఉన్నారు. ఏటీడీవో బీ సత్యవతి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, మాజీ సర్పంచ్ చాపల బాపురెడ్డి, నాయకులు ధరావత్ సోమన్న, ముదసాని సురేశ్, హేమంత్, చంటి, అశోక్, గణేశ్ దేవేందర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

మరిపెడ, ఏప్రిల్ 1 : ఎండలు పెరుగుతున్నందున ప్రజలు తమ ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.మురళీధర్ అన్నారు. సోమవారం మున్సిపల్ కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యసిబ్బందికి వివరించారు. నిల్వ ఉన్న మాంస పదార్థాలు, మద్యం తీసుకోవద్దన్నారు. మజ్జిగ, కొబ్బరి, మంచి నీళ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డా.గుగులోత్ రవి పాల్గొన్నారు.

తొర్రూరు ఎక్సైజ్ ఇన్‌చార్జిగా ప్రవీణ్

ప్రవీణ్

తొర్రూరు, ఏప్రిల్ 1: తొర్రూరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌చార్జి అధికారిగా రాజేశుని ప్రవీణ్‌ను నియమిస్తూ ఎక్సైజ్ శాఖ కమిషనర్ శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ప్రవీణ్ జనగామ జిల్లా కేంద్రంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎక్సైజ్ సీఐగా వ్యవహరించిన భాస్కరరావు దీర్ఘకాలిక సెలవులో వెళ్లగా, ఆయన స్థానంలో ప్రవీణ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయనతోపాటు నూతన ఎక్సైజ్ ఎస్సైలుగా తిరుపతి, అనీల్ బాధ్యతలు చేపట్టారు. ఎక్సైజ్ కార్యాలయం నుంచి మద్యం తరలింపు వ్యవహారంలో బాధ్యురాలిని చేస్తూ ఎక్సైజ్ ఎస్సై రవళిరెడ్డిని వరంగల్‌లోని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి అటాచ్డ్ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్‌చార్జి అధికారి ప్రవీణ్ మాట్లాడుతూ.. తొర్రూరు సర్కిల్‌లో గుడుంబా, కల్తీ మద్యం, గంజాయి, ఇతర నిషేధిత పదార్థాల కట్టడికి కృషి చేస్తానని తెలిపారు. ఎక్సైజ్ శాఖకు స్థానికులు సహకరించాలని కోరారు.

రూ.1.64 కోట్ల ఆస్తి పన్ను వసూలు

తొర్రూరు, ఏప్రిల్ 1: తొర్రూరు మున్సిపాలిటీలో 79.28శాతం ఆస్తి పన్నులు వసూలు చేసినట్లు కమిషనర్ శాంతికుమార్ తెలిపారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో ఆస్తి పన్ను వసూలు వివరాలు ఆయన వెల్లడించారు. రూ.2.7కోట్ల లక్ష్యంగా కాగా, రూ.6,432 ఇండ్లకు గాను రూ.1.64కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. రూ.42.68 లక్షలు వసూలు కావాల్సి ఉందన్నారు. ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లించే వారికి 5శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు.

చలి వేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

కేసముద్రం, ఏప్రిల్ 1: పీడీఎస్ఎస్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని జ్యోతిరావు పూలే సెంటర్‌లో చలి వేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే మురళీనాయక్ ప్రారంభించారు. వేసవి ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ఎస్ సంస్థ ప్రతినిధులు బనిశెట్టి వెంకటేశ్, బనిశెట్టి విజయ పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ఇనుగుర్తి, ఏప్రిల్ 1 : పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని ఎస్సై వంశీధర్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

అధికారులు అలసత్వం ప్రదర్శించొద్దు

నెల్లికుదురు, ఏప్రిల్ 1: గ్రామాల్లో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఎంపీడీవో బాలరాజు అధికారులను ఆదేశించారు. మండలంలోని వస్రాంతండా, రావిరాల, పార్వతమ్మగూడెం, మధనతుర్తి గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఉపాధి పనులు, తాగునీటి వనరులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పనుల వద్ద కూలీలకు సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. తాగునీటి ఎద్దడి నివారణలో అధికారులు అలసత్వం ప్రదర్శించొద్దని, సమస్య పరిష్కారానికి తనను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, THIRUNAHARI SATYANARAYANA (New Name) previously called SATHYANARAYNA (Old Name) R/o H.No. 35-2-2, Gopalapuram, Opp: Grampanchayathi Office, Hanamkonda, Bheemaram (Rural), Po: KC Colony, Warangal Urban Dist-506015, TS india.
NTW-000

WANTED HOSPITAL STAFF

jobs Apply Now!

★మెడికల్ షాప్ Boys/ ఫార్మసిస్ట్‌లు, GNM నర్సులు, O.T. Assts. కావలెను. సంప్ర: GUARDIAN HOSPITAL, ములుగు 'X' రోడ్, WGL. 12 to 2pm.
NTW-369

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

గేట్‌వాల్వ్‌కు మరమ్మతు చేయిస్తున్న డీఎల్‌పీవో గంగాభవాని, ఇతర అధికారులు

జగ్గుతండాలో పారిశుధ్య పనులు

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

బయ్యారం, ఏప్రిల్ 1 : మండలంలోని జగ్గుతండా గ్రామంలో సోమవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. పరిసరాల అపరిశుభ్రత.. గ్రామస్తుల ఇబ్బందిపై ఆదివారం నమస్తే తెలంగాణలో 'అధ్వానంగా జగ్గుతండా' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు తండాలో పేరుకుపోయిన చెత్తా చెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. లీకవుతున్న గేట్‌వాల్వ్‌కు మరమ్మతు చేపట్టారు. పందులు గ్రామంలో ఇష్టారాజ్యంగా తిరగకుండా వాటి పెంపకం దారులకు నోటీసులు అందజేశారు. పారిశుధ్య పనులను డీఎల్‌పీవో గంగాభవాని, మండల ప్రత్యేక అధికారి నర్సింహారావు, ఎంపీడీవో శ్రీనివాసరావు పర్యవేక్షించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు . ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీజ, సెక్రటరీ ఉష పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని గద్దె దించాలి

మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు

కురవి, ఏప్రిల్ 1 : మతోన్మాద బీజేపీని గద్దె దించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే ప్రతిపక్ష పార్టీల నాయకులపై ఈడీ, ఐటీ, సీబీఐ సంస్థల ద్వారా అరెస్టులు చేస్తూ జైలు పాలు చేస్తున్నదన్నారు. ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలను జైలుకు పంపుతున్నదన్నారు. అవినీతి చేసిన వ్యక్తులు బీజేపీలో చేరగానే నీతిమంతులవుతున్నారని, దేశంలో నిరుద్యోగం, రైతు సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. ప్రజలు, మేధావులు ఆలోచించి పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాదులకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి విజయసారథి మండల కార్యదర్శి కరణం రాజన్న తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు అండగా ఉంటాం..

- జిల్లా బాలల పరిరక్షణ విభాగం
- నమస్తే తెలంగాణ కథనానికి స్పందన

పిల్లలలో మాట్లాడుతున్న అధికారులు

కేసముద్రం, ఏప్రిల్ 1: తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన పిల్లల పరిస్థితిపై జిల్లా బాలల పరిరక్షణ విభాగం, శిశు సంక్షేమశాఖ అధికారులు సోమవారం ఆరా తీశారు. వారితో మాట్లాడారు. మండల కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్ కాలనీకి చెందిన దుర్గం ధర్మి- శోభ దంపతులు మృతి చెందడంతో వారి పిల్లలు దేవేందర్, అమర్, అఖిల అనాథలుగా మారారు. ఈ మేరకు సోమవారం 'అనాథల య్యారు' అనే శీర్షికతో నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు వారి పరిస్థితిని పరిశీలించారు. అనాథ పిల్లలకు అండగా ఉంటామని, అఖిలను చదివిస్తామని బాలల సంరక్షణ అధికారి నరేశ్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో విజయలక్ష్మి, చైల్డ్ లైన్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటేశ్, సూపర్‌వైజర్ సరోజన, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఆకేరు ఎండింది..

గడిచిన పదేళ్లలో మండువేసవిలోనూ జలకళతో ఉట్టిపడిన ముల్కలపల్లి శివారులోని ఆకేరు వాగు ఎండిపోయింది. ఏప్రిల్ నెలలోనే వెలవెలబోతున్నది. పశువులు, పక్షులు తాగేందుకు కూడా చుక్క నీళ్లు లేవు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎన్నడూ ఎండని ఆకేరు వాగు ఇప్పుడు రాళ్లు తేలి బోసిపోయింది. - డోర్నకల్, ఏప్రిల్ 1

తాగునీటి ఎద్దడిని నివారించాలి

చిన్నగూడూరు ఏప్రిల్1 : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి వరలక్ష్మి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల అధికారులు, కార్యదర్శులు, సిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్‌అలీ, ఎంపీడీవో రామారావు, భగీరథ డీఈ అనూష